# రెడ్‌మార్క్

## -తొత్తడి గణపతిరావు

సెక్షన్ వైజ్ అటెండెన్సు రిజిష్టరు ఒకటి ఒకటిగా చూస్తున్నాను. వెరీగుడ్ యింప్రూవ్‌మెంట్. ఇంతకుముందు 10.30కి థర్టీ పర్సెంటు అటెండెన్సు కూడా ఉండేదికాదు. ఈ రెండునెలల్లో మంచి ఫలితం. దాదాపు ఎయిటీ పర్సెంట్ ఎటెండెన్సు)...

ఇంతమంచి ఫలితానికి కారణం నేను తీసుకొన్న మెజర్సే కారణం. అలాగని ఎవరినీ తిట్టలేదు. ఎవరినీ భయపెట్టనూ లేదు. ఎవరిమీద ఏవిధమైన ఏక్షనూ తీసుకోలేదు ఆలస్యంగా వచ్చినందుకు.

నేను చేసిందంతా అందర్నీ సైన్ చేసినప్పుడు యింతకు ముందులా ఎవరి సెక్షన్‌లో వాళ్ళు కాకుండా నా ముందరకొచ్చి సైన్ చెయ్యమన్నాను. మొదట్లో లేట్ కమ్మర్స్ అంతా పొలోమంటూ నా రూమ్‌కొచ్చి సైన్ చేసేవాళ్ళు రాను రాను ఆ సంఖ్య పూర్తిగా పడిపోయింది. కారణం ప్రతిరోజు ఓ హయ్యర్ ఆఫీసర్ ముందు తప్పు చేసినందుకు తలదించుకొన్నట్లు సంజాయిషీ చెబుతూ సైన్ చెయ్యాల్సి రావడం అనేది వాళ్ళ అహం మీద బాగా దెబ్బ తీసింది. లేట్ కమ్మర్స్ సంఖ్య బాగా తగ్గింది. ఎవరో ఒకటీ అరా....

యథావిధిగా రిజిష్టర్స్ చూస్తున్న నేను పర్చేజ్ సెక్షన్ రిజిష్టర్ చూస్తూ ఆగిపోయాను. కోపంతో వళ్ళు మండింది. సీతమ్మ యీ రెండు నెలల్లో టైంకి ఆఫీసుకు వచ్చింది రెండు, మూడు సార్లు మాత్రమే.

వారానికి రెండు రోజులు మాత్రం ఆఫీసుకొచ్చి అన్ని రోజుల సంతకాలు అందంగా పెట్టేసే నీలవేణిని దార్లోకి తెచ్చాను.

''ఏమిటీ ఆయనగారి రూమ్‌కెళ్ళి చేతులు కట్టుకుని సంజాయిషీ చెప్పి సంతకం చెయ్యాలా? ఇదేమన్నా ఆఫీసా? జైలా? నేను చెయ్యను ఏం చేస్తాడో చూస్తాను'' అనే రివల్యూషనరీ టైపు మాణిక్యాలరావుని మార్చగలిగాను.

''ఆహా..రూల్స్ మాట్లాడుతున్నాడా? అయితే మనమూ రూల్స్ ప్రకారమే ఫైల్సు కదుపుదాం. అప్పుడు కదిలొస్తాడు పెద్దమనిషి'' అని బిగదీసుకొన్న నాగభూషణాన్ని లైన్లో పెట్టాను. కాని ఆఫ్టరాల్ ఓ క్లాస్ ఫోర్ ఎంప్లాయీ....ముసల్ది...ఈ సీతమ్మను మాత్రం మార్చలేకపోయాను.

''ఆ..ఏం చేస్తాడు? తలదీసి మొలేస్తాడా? అనుకుంటుందేమో! ఇన్ని రోజులు లేటయినా తన రూమ్‌కొచ్చి ఎప్పుడూ సైన్ చేసిన గుర్తు లేదు. తను లేనప్పుడు చూసి ఎప్పుడో పెట్టేస్తుంది. లేట్ కమ్మర్స్‌కి తను 'రెడ్ మార్క్' వేస్తాడు. వాళ్ళు ఆ మార్క్ ప్రక్కన సంతకం చేస్తారు. తన ముందు తమ లేట్‌కు సంజాయిషీ యిచ్చుకుంటూ....కాని యీ సీతమ్మ సంతకాలు కన్పిస్తున్నాయ్ తప్ప. ఎప్పుడూ తన ముందు సంతకం చేసిన గుర్తులేదు. అంటే తను రూమ్‌లో లేని సమయం చూసుకుని వచ్చి సంతకం చేసి పోతుందన్నమాట. ఇవాళ యీ ముసల్దాని పని పట్టాలి.

సుమారుగా ఏభయి ఏళ్ళుంటాయ్. ముసలితనం పూర్తిగా శారీరకంగా వచ్చేసినా మాటతీరు....పనిలో స్పీడు వుంది. నడక తీరు మాట తీరులో ఓ విధమైన తెగువరితనమూ కన్పిస్తాయ్. అందుకనే తనంటే లెఖ్ఖ లేదు. నా ఆభిజాత్యం కొంచెం దెబ్బతింది....ఈ కేస్ యివాళ తేల్చుకోవల్సిందే అనుకున్నాను.

రిజిష్టర్స్ చూడ్డం ముగించి ఎకౌంట్సు సెక్షన్ వైపు వెళ్ళాను. ఎకౌంట్స్ సెక్షన్‌లో ఓ అరగంట గడిచింది. అక్కడ్నుంచి రూమ్‌కి వస్తుంటే సంతకం పెట్టేసి ఆదరాబాదరాగా రూమ్ నుంచి బయటికి వస్తున్న సీతమ్మ కన్పించింది.

అసలే నలుపురంగు..అందులో ఎండలో పడి వచ్చిందేమో చమటలు కక్కుతూ వుంది. నన్ను చూసి గాబరాగా రూమ్ దాటబోతున్నదల్లా ఆగి ప్రక్కకు తప్పుకుని నిలబడింది.

నేను రూమ్‌లోకి నడుస్తూ...''సీతమ్మా....రా లోపలికి'' అన్నాను.

నెమ్మదిగా వెనుదిరిగి వచ్చి ఎదురుగా నిల్చుంది. సుమారుగా నా తల్లి వయసు వుంటుంది. ఈ వయోభేదం గుర్తుకొచ్చి ఆవిడ్ని గదమాయించడానికి కొంచెం సంశయించాను. అయినా అందరూ గౌరవిస్తున్న నామాటని ఆవిడ ఖాతరు చెయ్యడం లేదన్న విషయం గుర్తుకొచ్చి నా అహం దెబ్బతింది. అందుకే నా అధికారాన్ని ఒక్కసారి ఝుళిపించాలనుకున్నాను.

''ఈ రెండు నెలల్లో ఎన్నిసార్లు 10గంటలకు వచ్చావు''

''బస్సులు దొరకవుబాబూ! మాయిదారి పట్నం......మొదట్లో ఆఫీసు దగ్గరే యిల్లు వుండేది...అద్దె లెక్కువని వదిలేసి దూరమెళ్ళాను. బస్సులు దొరకడం లేదు. మంచినీళ్ళు తెమ్మంటారా'' తెలివిగా టాపిక్ మారుస్తూ టేబిల్ మీదిగ్లాసందుకుంది.

''ఆ గ్లా సక్కడ పెట్టు, నాకు మంచినీళ్ళు తెచ్చి పెట్టడానికి మనుషులున్నారు. రేపట్నుంచి లేటుగా వస్తే శలవు చీటీ యివ్వు. సంతకం పెట్టడానికి మాత్రం వీలులేదు'' కటువుగా అన్నాను.

''బస్సులు దొరికితే వచ్చేస్తాను బాబూ...గోయిందా అయ్యగారికి మంచినీళ్ళు''. యింక నా మాటకు ఎదురు చూడకుండా బయటికెళ్ళి పోయింది.

ఏమిటీ ముసల్దాని సంగతి..తెలివి తక్కువతనం అనుకోవాలా? అతి తెలివి అనుకోవాలా? లేటవుతున్నందుకు క్షమించమని తనను అడగలేదు. బతిమిలాడలేదు..క్యాజువల్‌గా తీసుకుంటూ ''బస్సులు దొరికితే వచ్చేస్తాను బాబూ'' అంటూ వెళ్ళిపోతుంది. అంటే బస్సులు సరిగ్గా దొరకవు రాలేను అని చెప్పటమేగా.

ఓ కోర్టు కేస్ విషయంలో బెంగుళూరు వెళ్ళమని మెసేజ్ వచ్చింది. వెళ్ళి అన్నీ చక్కబెట్టుకునేసరికి ఏదో అర్జెంటు మీటింగ్..తర్వాత పర్సనల్ పనిమీద ఓ పది రోజులు శలవు..అన్నీ అయి ఆఫీసు కొచ్చేసరికి ఓ యిర్వై రోజులు దాటింది.

నాకు డిసిప్లిన్...టైమింగ్ మెయింటైన్ చెయ్యని వాళ్ళంటే చాలా చిరాకు. చాలా గ్యాప్ వచ్చింది. మళ్ళీ ఆఫీసు స్టాఫ్ మామూలు పద్ధతులకు అలవాటు పడిపోయి 11గంటలకు వస్తున్నారేమో అన్పించింది.


'రాఘవ' నా బెస్టు ఫ్రెండు..'అనుభూతి' పత్రికలో నా కథొకటి పడింది. చదువు అంటూ ఫోన్ చేసి చెప్పాడు. పత్రిక తెప్పించి చదివాను. ఫర్వాలేదు. బాగానే వ్రాస్తాడు.

ఓ ఉద్యోగినికి సంబంధించిన కథ ఆఫీసరు చండశాసనుడు! డిసిప్లిన్ అంటే పడి చచ్చే ఆఫీసరు దగ్గర ఉద్యోగం, ఇంట్లో ముట్టి ముట్టి ఉన్న సమస్యలు. పెళ్ళికాని అమ్మాయి తన పెళ్ళి కాకపోవడానికి కట్నం యివ్వలేని తల్లే కారణం అన్నట్టు అనుక్షణం ఆమెను సాధిస్తూ వుంటుంది. రెండుకాళ్ళు చచ్చుబడిపోయి పోలియో వ్యాధితో బాధపడుతున్న వాడు ఒక కొడుకయితే..మనిషి ఎదిగినా మనసు ఎదగక వింతగా ప్రవర్తించే 'పిచ్చి' కొడుకు యింకోడు. తెల్లవారి ఐదు గంటలకు హడావుడిగా మొదలయ్యే ఆమె కార్యక్రమం కార్పొరేషన్ కుళాయి ముందు నీటికోసం మొదలయ్యే పోరాటంతో ప్రారంభమయి ఇంట్లో అరకొర సరంజామాతో..అస్తవ్యస్తమైన ఆర్థిక స్థితిలో అందరి అవసరాలు తీర్చడానికి ఆవిడపడే అవస్థ చాలా చక్కగా చిత్రించాడు రాఘవ. అందరికీ అన్నీ అమర్చిపెట్టి

ఆదరాబాదరాగా బస్సందుకునేసరికి 10.30..ఆఫీసు చేరుకునే సరికి 11గం.లు. ఆఫీసులో అక్షింతలు..అయ్యవారి గాం(డింపులు.

ఇదీ ఆవిడ దినచర్య...జీవితం.

ఆఫీసు చేరే వరకు ఆమె పడుతున్న బాధ...ఆఫీసుకు టైమ్‌కు చేరుకోవాలనే టెన్షన్ చాలా చక్కగా చిత్రించాడు రాఘవ. ఎలాంటి మనిషికైనా 'అయ్యోపాపం' అన్పించక తప్పదు. ఇక ముగింపు విషయానికొస్తే అదే హడావుడితో ఓ రోజు బస్సెక్కబోతూ తూలి పడి స్పృహ తప్పుతుంది. ఏం జరిగిందో తెలుసుకోవాలని కళ్ళు తెరిచి ఎదురుగా కన్పించిన గడియారంలో 12గంటలు అవ్వడం చూసి అయ్యో పన్నెండయిపోయింది చాలా లేటు అనుకుంటూ ఆదరాబాదరాగా లేవబోయిన ఆమె కట్లతో నిండిన శరీరం అందుకు సహకరించకపోవడంతో తను బస్సెక్కబోతూ పడిపోయి హాస్పిటల్ బెడ్‌మీద వున్నానని గుర్తిస్తుంది. ''భగవంతుడా నన్నెందుకు బ్రతికించావ్...తీసుకుపోలేకపోయావా?'' అని నిర్వేదంగా అనుకొంటున్న ఆమెకు...ఆమె కళ్ళు తెరవడం కోసమే ఎదురు చూస్తున్నట్టుగా ఎదురు నిల్చున్న కూతురు, కొడుకులను చూసి...వాళ్ళ ముఖాల్లో దైన్యాన్ని చూసి ''అయ్యో నేను పోతే వీళ్ళ గతేమిటి?'' అనుకుంటుండగా కథ ముగుస్తుంది. ఈ ఎండింగ్‌లో మాత్రం ఎవరికైనా మనస్సు కలుక్కుమంటుంది.



బాధలు సమస్యలు ఒకదాని మీద ఒకటి స్వారీ చేస్తున్నట్లు వచ్చి ఆమె జీవితంలో చొచ్చుకుంటాయ్. 'అయ్యోపాపం' అనుకునేలా కథను మలిచాడు రాఘవ.

రాఘవ ఫోన్ నెంబర్ డయల్ చేశాను.

''హలో రాఘవ''

''యస్ రాఘవ హియర్''

''అయామ్...రావ్..సుందర్రావ్..నీ కథ చదివాను. సినిమాలకు ట్రై చెయ్యకూడదూ....సినిమాకు సరిపడే మసాలా అంతావుంది.''

''నచ్చలేదా?''

''నచ్చడం అంటే చదవడానికి బావుంది. నీ పెన్ పవర్‌ను మెచ్చుకోవచ్చు. కానీ ఓ మనిషి చుట్టూ అన్ని సమస్యలు. సమస్యలు మనిషిని ఊపిరి పీల్చుకోనివ్వకుండా చేసి పాఠకుల చేత అయ్యో పాపం అన్పించేలా వ్రాసాక యింకెందుకు చివర్లో ఆమెను చంపెయ్యలేకపోయావా? మంచి ట్రాజెడీ అయ్యుండేది. జాలి వర్షం కూడా బాగా కురిసేది.''

''నిజమే...కేవలం కథ కోసమే అయితే ఆ పాత్రను చంపేసేవాడ్నే. కాని అదో సజీవపాత్ర...ఇది కేవలం జరిగిన సంఘటనలకు ఓ కథారూపం మాత్రమే. కల్పిత కథ కాదు.'' అన్నాడు రాఘవ.

''సజీవ పాత్ర...నేను నమ్మను''

''అవును. నువ్వెందుకు నమ్ముతావు-ఎవరో అన్నట్టుగా 'యుహేవ్ బోర్న్ విత్ ఎ గోల్డ్ స్పూన్ ఇన్ యువర్ మౌత్' నీకు కష్టాలు కన్నీళ్లు ఎలా తెలుస్తాయ్. పోనీ చూడాలని వుందా ఆ సజీవ పాత్రను..చూపిస్తాను.ఈసారి మా యింటికి వచ్చినప్పుడు చూపిస్తాలే..'' అన్నాడు రాఘవ.

''అలాగే నాకూ చూడాలని వుంది. వుంటాను మరి'' ఫోన్ పెట్టేశాను.

దాదాపు యిరవైరోజుల గ్యాప్ తర్వాత ఆఫీసుకొచ్చాను. యథావిధిగా అటెండెన్సు రిజిష్టర్స్ నా టేబిల్ మీద పెట్టాడు ప్యూన్. రిజిష్టర్స్ చూస్తున్నాను. పర్చేజ్ సెక్షన్ రిజిష్టర్‌లో సీతమ్మ సంతకం ఖాళీ....ఈరోజుకాదు....దాదాపు పదిహేనురోజుల నుండి..సిక్ అని పెన్సిలుతో వ్రాసి వుంది. సెక్షన్ హెడ్‌ను పిలిపించి అడిగాను.

''పాపం సీతమ్మకు ఏక్సిడెంటు అయింది సార్. కాలు ఫ్రాక్చర్ అయింది. హడావుడిగా బస్సెక్కుతూ పడిపోయిందట. మనిషికి కంగారెక్కువ. మీకు తెలుసుకదా!'' అన్న సెక్షను హెడ్ మాటలు వింటుంటే తక్కున రాఘవ కథ గుర్తుకొచ్చింది. ఇది కథకాదు. జరిగిన సంఘటనలకో కథారూపం....అంటే ఖర్మకాలి రాఘవ కథకు సీతమ్మ యిన్‌స్పిరేషన్ కాదుకదా!

రాఘవ కథకు సీతమ్మే యిన్‌స్పిరేషన్ అయితే..సీతమ్మ ఏక్సిడెంటుకు యిండైరెక్టుగా కారణం తను. బాధగా అన్పించింది. లేటుగా వస్తున్నందుకు రెడ్ మార్క్ వేసే తనకు ఇదో 'రెడ్‌మార్క్'లా అన్పించింది. తన మూలంగా ...ఆమె ఏక్సిడెంటుకు గురవ్వటం...పరోక్షంగానే అయినా.....

రెడ్‌పెన్ అలాగే రిజిష్టర్ మీద పడేస్తూ ఆలోచనలో పడిపోయాను.

★